


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 23-7-2025
సంపుటి: 21 సంచిక: 103
పేజీలు: 8 వెల: రూ.1

## గంజాయి బ్యాచ్‌పైకి డాగ్ స్క్వాడ్!

- రంగంలోకి దిగిన స్నిఫ్ఫర్ డాగ్
- ఎస్పీ ఆధ్వర్యంలో నార్కోటిక్స్ పోలీసుల తనిఖీలు
- న్యూకాలనీ ప్రాంతంలో సోదాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




జిల్లాలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రాంతాలతో పాటు అనుమానమున్న ఇళ్లు, షాపుల్లో ఇకనుంచి పోలీసులు భౌతిక తనిఖీలకు సిద్ధమయ్యారు. అందువల్ల పోలీసులకు దొరక్కుండా గంజాయి నిల్వలను దాచేస్తే సరిపోతుంది.. అనే భావన గంజాయి అమ్మకందారుల్లో ఉంటే ఇక దానికి తిలోదకాలివ్వాల్సిందే. జిల్లాలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి చొరబడకుండా చూడాలని పోలీసు డిపార్ట్‌మెంట్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నా.. జిల్లాకు రెండు వైపులా ఒడిశా బోర్డర్ ఉండటం, అనేక మారుమూల గ్రామీణ మార్గాల నుంచి ఒడిశా-ఆంధ్ర మధ్య రాకపోకలు సాగించే అవకాశాలు ఉండటంతో ఏదో ఒక మార్గం ద్వారా గంజాయి జిల్లాలోకి ప్రవేశిస్తోంది. ఇలా ఒడిశా నుంచి వస్తున్న గంజాయి గమ్యస్థానం శ్రీకాకుళమేనని తేలడంతో ఎస్పీ మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో నార్కోటిక్స్ విభాగం విస్తృతంగా తనిఖీలు చేపడుతోంది. ఇంతవరకు పోలీసులే వచ్చి షాపుల్లోనూ, అనుమానం ఉన్న ఇళ్లలోనూ సోదాలు చేసి, సరుకు దొరికితే కేసు నమోదు చేసేవారు. కానీ ఇప్పుడు నార్కోటిక్స్ విభాగం ఆధ్వర్యంలో గంజాయి వాసనను పసిగట్టే స్నిఫ్ఫర్ డాగ్‌ను రంగంలోకి దించారు. గంజాయి వాసన సోకితే చాలు.. ఈ శునకం వ్యక్తిగత సోదాలకు ముందే పోలీసులను సరుకు ఉన్న చోటుకు తీసుకువెళ్తుంది. న్యూకాలనీలో సోమేశ్వరరావు చిన్నపిల్లల ఆస్పత్రి జంక్షన్ వద్ద గతంలో బడ్డీలు ఉండేవి. ఇక్కడ రాత్రీపగలు తేడా లేకుండా మద్యం సేవనం జరిగేది. అయితే ఈ బడ్డీల వెనుక భాగంలో ఉన్న స్థలాన్ని కొందరు కొనుగోలు చేయడంతో వాటిని ఖాళీ చేయించారు. అయినా ఆ ప్రాంతం వద్దకు ఇప్పటికీ యువకులు పెద్ద సంఖ్యలో గుమిగూడుతున్నారు. దీంతో ఆ సమీపంలో గంజాయి అమ్ముతున్నారేమోనన్న అనుమానంతో నార్కోటిక్స్ విభాగం నుంచి రుషికేష్, రాజేష్‌లతో కూడిన బృందం గంజాయిని పసిగట్టే స్నిఫ్ఫర్ డాగ్‌ను తీసుకొచ్చి న్యూకాలనీలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో కొన్ని బడ్డీలు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు కూడా ఉన్నాయి. సిగరెట్‌లో పొగాకును తీసేసి గంజాయి దట్టించి జేబులో పెట్టుకున్నా స్నిఫ్ఫర్ డాగ్ పసిగట్టేస్తుంది. దీంతో గంజాయి సేవించేవారిని సైతం పట్టుకోడానికి నార్కోటిక్స్ పోలీసులు సిద్ధపడుతున్నారు. మరోవైపు గంజాయి సేవించినా, పేకాడుతూ దొరికిపోయినా, చిల్లర కొట్లాటల్లో కోర్టుకు వచ్చినా స్థానిక బెంచ్‌కోర్టు న్యాయమూర్తి కర్రి శివరామకృష్ణ నిర్మొహమాటంగా జైలుశిక్ష వేసేస్తున్నారు. ఒకవైపు పోలీసులు, మరోవైపు జ్యుడీషియరీ కలిసి పని చేస్తున్నా నగరంలో గంజాయి సేవించి రోడ్ల మీదే తలలు బద్దలుగొట్టుకుంటున్న కేసులు తగ్గడంలేదు.

## కలెక్టర్‌నే బెత్తం పట్టించిన బది'లీలలు'!



కలెక్టరేట్‌లో కూర్చుని బదిలీ ప్రక్రియపై కసరత్తు చేస్తున్న ఉద్యోగులు




బెందాళం అశోక్, ఎన్‌ఈఆర్‌లు ఒకే ఉద్యోగికి ఇచ్చిన సిఫార్సు లేఖలు.

రెండు స్థానాలు కోల్పోవడంతో రోధిస్తున్న తులసమ్మ

- జిల్లాలో సీరియల్ సాగుతున్న ప్రహసనం
- ఒకే పోస్టుకు ఇద్దరిద్దరికి పోస్టింగ్
- అప్పటికే ఉద్యోగి ఉన్న పోస్టుకు మరొకరి ట్రాన్స్‌ఫర్
- ఎమ్మెల్యేల సిఫార్సులు బుట్టదాఖలు.. మామూళ్లకే అగ్రాసనం
- వైద్య, సంక్షేమ, బీసీ, సర్వే శాఖలో భారీ అక్రమాలు
- వైద్య ఆరోగ్య శాఖపై కలెక్టర్ యమ సీరియస్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

☛ రాజాం మండలం బొద్దాంలో ఒక ఏఎన్ఎం పోస్టు ఉంటే ఇద్దరిని అక్కడికి బదిలీ చేశారు. వారిలో విమలకుమార్ అనే ఆమె సినియర్ కాగా మరో ఏఎన్ఎం జూనియర్. కానీ జూనియర్ ఏఎన్ఎం ముందుగా వెళ్లి బొద్దాంలో జాయిన్ అయిపోయారు. కొర్లకోటకు చెందిన విమలకుమారి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సిఫార్సు లేఖను తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. ఇదే విషయాన్ని ఆమె డీఎంహెచ్‌వో వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నా.. ఇప్పుడేమీ చేయలేమని తేల్చేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్ మాత్రం అటెండర్ దుర్గారావు ద్వారా మూడు జీడిపప్పు ప్యాకెట్లు, రూ.15 వేల తీసుకుని అభయహస్తం ఇచ్చి కూడా ఎగవేశారు. దాంతో ఆమె కలెక్టర్ సమక్షంలోనే మొత్తం విషయం బయటపెట్టేశారు.

☛ బదిలీ ప్రక్రియ పూర్తి అయినా జిల్లాలో 34 మంది ఏఎన్ఎంలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రిలీవ్ చేయలేదు. బదిలీల వివరాలను కూడా హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు. దాంతో ఏకంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 34 మంది ఏఎన్ఎంలు ఏమయ్యారని జిల్లా కలెక్టర్‌ను ఆరా తీశారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ బాధ్యతను ఎవరికి అప్పగించారని

- మిగతా చివరి పేజీలో

## ఆ రాతిగుహలే.. మనకు రక్ష!



- -భూగర్భంలో వ్యూహాత్మకం ఇంధన నిల్వ కేంద్రాలు
- -ప్రస్తుతం విశాఖతో సహా మూడు చోట్ల ఈ సౌకర్యం
- -కొత్త నిర్మాణంలో రెండు.. ప్రతిపాదనల్లో మూడు
- -75 రోజుల దేశీయ అవసరాలకు సరిపడేలా నిర్ణయం
- -చమురు కొరత, ధరల పెరుగుదలను ఎదుర్కొనే వ్యూహం

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

మూడేళ్ల నుంచి కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇటీవలి ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం.. వీటికి ఇంకా వెనక్కి వెళితే ఇరాన్-ఇరాక్ యుద్ధం.. గల్ఫ్, మధ్యప్రాచ్యంలో ఘర్షణలు, అశాంతి.. ఇలా ప్రతి సందర్భంలో ఒకే ఒక్క అంశం భారత్‌తోపాటు ప్రపంచ దేశాలను భయపెడుతూ వస్తోంది. అదే చమురు సంక్షోభం. అప్పుడూ ఇప్పుడూ యుద్ధాలు, ఘర్షణలు తలెత్తినప్పుడల్లా ముడిచమురు ధరలు అమాంతం పెరిగిపోయి దిగుమతులపైనే ఆధారపడిన భారత్‌లాంటి దేశాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. తాజాగా తమ ఆంక్షలను కాలదన్ని రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటే 500 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టో భారత్ సహా చైనా, బ్రెజిల్ దేశాలను హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై కేంద్ర ఇంధన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి స్పందిస్తూ ఇటువంటి పరిస్థితులను ధీటుగా ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేసుకుందని చెప్పారు. గతంలో గల్ఫ్‌తో సహా 27 దేశాల నుంచే ముడి చమురు(క్రూడ్ ఆయిల్) దిగుమతి చేసుకునేవారమని.. తాజా పరిస్థితుల నేపథ్యంలో దిగుమతుల చెయిన్‌ను 40 దేశాలకు విస్తరించామని చెప్పారు. అయినా కూడా ముడి ఇంధనం కొరత ఏర్పడితే మన పరిస్థితి ఏమిటి? మన ఇంధన అవసరాలకు 80 శాతానికిపైగా దిగుమతులపైనా ఆధారపడుతున్న నేపథ్యంలో ఉన్న ఫళంగా దిగుమతులు నిలిచిపోతే గట్టెక్కగలమా?? అన్న ప్రశ్నలు తలెత్తడం సహజం. అయితే దానికి కూడా కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. అదే వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల (స్ట్రాటజిక్ ఫ్యూయల్ రిజర్వ్) నిర్వహణ. దేశంలోని మూడు కీలక ప్రాంతాల్లో భూగర్భ పెట్రోలియం నిల్వ కేంద్రాలను ఇంధన సంస్థలు నిర్వహిస్తున్నాయి. అటువంటి ఒక భూగర్భ నిల్వ కేంద్రం దేశ తూర్పు తీరంలోని విశాఖ నగరంలో ఉండటం విశేషం.

### పది రోజుల మేరకే నిల్వలు

దేశవ్యాప్తంగా భూగర్భంలో నిర్మించిన రాతి గుహలే ఇంధన సంక్షోభం ఎదుర్కోకుండా భారత్‌ను రక్షించగలుగుతాయి. ప్రస్తుతం దేశంలో విశాఖతో సహా కర్ణాటకలోని మంగళూరు, తమిళనాడులోని పాడూరు ప్రాంతాల్లో భూగర్భ చమురు నిల్వ కేంద్రాలు ఉన్నాయి. వీటి వల్ల ఎంతటి ఇంధన సంక్షోభం తలెత్తినా కొన్ని రోజులపాటు దాన్ని తట్టుకుని నిలబడే సత్తా భారత్‌కు లభించింది. ఈ మూడు భూగర్భ కేంద్రాల్లో కొన్ని మిలియన్ టన్నుల చమురును ముందుజాగ్రత్తగా భారత్ నిల్వ చేస్తోంది. అత్యవసర సమయాల్లో ఈ నిల్వలను వినియోగించాలన్నది భారత ప్రభుత్వ వ్యూహం. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ సమయంలో హర్మూజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ముడి చమురు ఉత్పత్తి చేసే సౌదీ అరేబియా, కువైట్, ఇరాక్, యూఏఈ తదితర దేశాలన్నీ తమ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ 33 కిలోమీటర్ల జలసంధిపైనే ఆధారపడి ఉన్నాయి. మెజారిటీ చమురు సరఫరా ఈ జలసంధి ద్వారానే జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఇరాన్ గానీ.. ఇంకేదైనా దేశం గానీ హర్మూజ్ జలసంధిని మూసివేస్తే ముడిచమురుతో సహా నేచురల్ గ్యాస్ రవాణా కూడా స్తంభించిపోతుంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల నుంచి దేశ ఇంధన అవసరాలను గట్టెక్కించేందుకు భారత్ వ్యూహాత్మక నిల్వ కేంద్రాల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

### ప్రస్తుతం మూడు.. నిర్మాణంలో మరో రెండు

దేశంలో ప్రస్తుతం మూడు కీలకమైన భూగర్భ రాతి గుహలు ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 90 మీటర్ల దిగువన నిర్మించిన ఈ గుహలు కిలోమీటర్ లోతు వరకు ఉన్నాయి. అలాగే విశాఖపట్నంలో ఉన్న ఎల్పీజీ నిల్వ గుహ 196 మీటర్ల లోతులో అంటే.. సముద్ర గర్భం కంటే దిగువన ఉండటం విశేషం. ఇది ప్రపంచంలోనే అత్యంత లోతులో ఉన్న స్టోరేజ్ కేంద్రం. ప్రస్తుతం ఉన్న విశాఖ, మంగళూరు, పాడూరు భూగర్భ కేంద్రాల్లో 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. మన దేశ అవసరాలకు ఈ నిల్వలు పది రోజుల వరకు సరిపోతాయి. వీటికి అదనంగా ఇటువంటి మరో రెండు భూగర్భ నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలని 2021లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు తమిళనాడులోని పాడూరులో 2.5 ఎంఎంటీ (25 లక్షల టన్నులు) సామర్థ్యంతో, ఒడిశాలోని చండీఖోల్‌లో 4 ఎంఎంటీ (40 లక్షల టన్నులు) సామర్థ్యంతో వీటిని నిర్మిస్తున్నారు. పాడూరులో ఇప్పటికే ఒక నిల్వ కేంద్రం ఉండగా, ఇప్పుడు రెండో కేంద్రం అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా మనదేశం 22 రోజుల పాటు పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా నెట్టుకురాగలదు.

### దేశీయ ఇంధన భద్రతే లక్ష్యంగా..

ఇప్పటికే ఉన్న మూడు కేంద్రాలు, కొత్తగా నిర్మిస్తున్న రెండు కేంద్రాలతోపాటు దేశీయ ఇంధన భద్రత కోసం కేంద్రం కొత్తగా మరో మూడు వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాలు నిర్మించాలని ప్రతిపాదించింది. రాజస్థాన్‌లోని బికనీర్, కర్ణాటకలోని మంగళూరు (ఇప్పటికే ఒకటి ఉండగా రెండోది), మధ్యప్రదేశ్‌లోని బినా ప్రాంతాల్లో నిర్మిస్తారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ కేంద్రాల నిర్మాణ సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే బాధ్యతను ప్రభుత్వరంగ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ ఇంజినీర్స్ ఇండియాకు అప్పగించింది. సాధ్యమైనంత త్వరలోనే వీటి నిర్మాణాలు చేపడతారని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ సీఈవో ఎల్ఆర్ జైన్ వెల్లడించారు. ప్రస్తుతం మంగళూరు, పాడూరు, వైజాగ్‌లలో 53.3 లక్షల టన్నుల ముడి చమురు నిల్వ చేసే వీలుంది. కొత్తగా ప్రతిపాదించిన బికనీర్‌లో






52-53 లక్షల టన్నులు, మంగళూరులో 17.5 లక్షల టన్నుల చమురు నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్నారు. బినా కేంద్రం నిల్వ సామర్థ్యాన్ని ఇంకా నిర్ణయించలేదు. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీలో మనదేశం చేరేందుకూ కొత్తగా విస్తరిస్తున్న చమురు నిల్వల సామర్థ్యం దోహదం పడుతుంది. 90 రోజుల వినియోగానికి అవసరమైన చమురు నిల్వ చేయగల వసతి ఉన్న దేశాలకే ఇందులో సభ్యత్వం లభిస్తుంది. ప్రస్తుతం మన కంపెనీల నిల్వ కేంద్రాలు, రవాణాలో ఉన్న చమురుతో కలిపి 75 రోజుల ఇంధన అవసరాలకు సరిపోతుంది.

• ఎడిటోరియల్

# రాజకీయ అనారోగ్యమే కారణం!

ఆరోగ్య కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. అయితే ఆయన చెబుతున్న ఆరోగ్య కారణాలు వేరని.. అవి శరీరానికి సంబంధించినవి కావని.. రాజకీయాలకు, మనసుకు సంబంధించినవని రాజీనామాకు కొన్ని గంటల ముందు జరిగిన పరిణామాలను ఉటంకిస్తూ కథనాలు, విశ్లేషణలు ప్రసార మాధ్యమాల్లో వస్తున్నాయి. దీని వెనుక పాలక బీజేపీ అధిష్టానంతో తలెత్తిన విభేదాలు, వారు తనపట్ల వ్యవహరించిన తీరుతో మనస్తాపానికి గురై ధన్‌ఖడ్ రాజీనామా చేశారంటున్నారు. సహజంగానే ఆవేశపూరితంగా వ్యవహరించే ధన్‌ఖడ్ పార్లమెంటు వర్షాకాల ప్రారంభం రోజే బీజేపీ పెద్దలకు నచ్చని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల తన ఇంట్లో నోట్ల కట్టలతో వార్తల్లోకి ఎక్కిన అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగనాథ్ వర్మపై ప్రతిపక్షాలు రాజ్యసభలో ప్రతిపాదించి అభిశంసన తీర్మానంపై చర్చకు సభాధ్యక్షుడి హోదాలో ధన్‌ఖడ్ అనుమతించి, అందుకు ఏర్పాట్లు చేయమని రాజ్యసభ సెక్రటేరియట్‌ను ఆదేశించడం బీజేపీ పెద్దలకు సుతరామూ నచ్చలేదు. ప్రభుత్వం తీసుకోవాల్సిన క్రెడిట్‌ను ధన్‌ఖడ్ తన చర్య ద్వారా ప్రతిపక్షానికి దక్కేలా చేశారని భావించింది. సభలోనే నడ్డా ఈ అంశంపై చేసిన వ్యాఖ్యలు ఉప రాష్ట్రపతిని అసంతృప్తికి గురి చేశాయి. అదే సమయంలో పలువురు బీజేపీ పెద్దలు ఫోన్లు చేసి తనపై అవిశ్వాస తీర్మానం పెడతామన్నట్లు హెచ్చరిక ధోరణిలో మాట్లాడటంతో మనస్తాపానికి గురయ్యారు. అవిశ్వాసాన్ని ఎదుర్కోవడం కంటే రాజీనామా చేసి గౌరవంగా తప్పుకోవడం మంచిదని భావించినట్లు కనిపిస్తోంది. బీజేపీ అంతర్గత రాజకీయాల వల్ల దేశంలోని రెండో అత్యున్నత రాజ్యాంగ పదవికి అవమానం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ అనూహ్య పరిణామం ఎన్డీఏ ప్రభుత్వంలో ఒక పెద్ద అంతర్గత తిరుగుబాటుకు సంకేతంగా భావిస్తుండటంతో పాటు రాజ్యాంగ వ్యవస్థలు, పదవుల స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన అవసరంపై దేశవ్యాప్తంగా సరికొత్త చర్చకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణ వ్యూహంలో భాగంగా ఇద్దరు న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానాలను ప్రవేశపెట్టాలని బీజేపీ నిర్ణయించింది. కానీ రాజ్యసభ చైర్మన్ హోదాలో ఉన్న ధన్‌ఖడ్ ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా కాకుండా స్వతంత్ర వైఖరి ప్రదర్శించారు. ముఖ్యంగా.. జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసన ప్రతిపాదనలో సాంకేతిక లోపాలున్నాయని బహిరంగంగా వ్యాఖ్యానించడమే కాకుండా ఆ తీర్మానాన్ని సభలో లిస్ట్ చేయాలని పార్లమెంట్ సెక్రటరీ జనరల్‌ను ఆదేశించారు. చైర్మన్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం బీజేపీ అధిష్టానానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ధన్‌ఖడ్ వైఖరికి ప్రతిగా, బీజేపీ తన అసంతృప్తిని పరోక్షంగా కానీ బలంగా కానీ తెలియజేసింది. పార్లమెంటు కార్యకలాపాల అజెండాను నిర్ణయించే కీలకమైన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశానికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇద్దరూ గైర్హాజరయ్యారు. చైర్మన్‌కు కనీస ముందస్తు సమాచారం లేకుండా జరిగిన ఈ చర్యను ధన్‌ఖడ్ తీవ్ర అవమానంగా, తన ఆత్మగౌరవానికి భంగకరంగా భావించారు. రాజ్యాంగబద్ధమైన తన విధులకు అడ్డుకట్ట వేయడాన్ని సహించలేక, మౌనంగా వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు స్పష్టమవుతోంది. ఇటీవల గుండెకు స్టెంట్ వేయించుకున్నప్పటికీ, ఆయన చురుగ్గానే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని జైపూర్ పర్యటనకు కూడా సిద్ధమయ్యారని అందువల్ల ఆరోగ్య కారణం ఒక సాకు మాత్రమేనని అంటున్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ పదవులు ఉన్నత రాజ్యాంగ పదవులు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత ఆ పదవుల్లో కూర్చున్నవారిపై ఉంటుంది. కానీ చాలా కాలంగా ఈ అత్యున్నత పదవులు రాజకీయ పునరావాసం కేంద్రాలుగా మారిపోయాయన్నది వాస్తవం. పాలక పార్టీలు వయసు మీరి రాజకీయంగా రిటైర్‌మెంట్ తీసుకున్న లేదా తమకు అతి విశ్వాసపాత్రులుగా ఉన్న పార్టీ నేతలను ఫక్తు రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తూ రాజ్యాంగ పదవుల్లో మెజారిటీ బలంతో కూర్చోబెడుతున్నారు. అలా ఎన్నికైన(ఎంపికైన) వారిలో పలువురు పార్టీ భేదం చూపించకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నప్పటికీ పలు సందర్భాల్లో ముఖ్యంగా గవర్నర్లు తమ పార్టీ ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది. సహజంగానే ఇప్పుడు ధన్‌ఖడ్ విషయంలో బీజేపీ తీరు రాజ్యాంగ వ్యవస్థల ఔన్నత్యంపై నీలినీడలు ప్రసరింపజేసింది.

## అనురాగ నిలయంలో అన్నదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిన్నారుల పుట్టినరోజున అన్నదానం చేయడం హర్షణీయమని, వేడుకలను నిస్సహాయుల మధ్య జరుపుకోవటం మంచి విషయమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహనరావు బుధవారం అన్నారు. పెద్దపాడుకు చెందిన బొట్ట సాయికుమార్, హేమలతల కుమార్తె, కుమారుని మొదటి జన్మదినం సందర్భంగా స్థానిక శాంతా కళ్యాణ అనురాగ నిలయంలో వృద్ధులకు, చిన్నారులకు అన్నవితరణ, చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నప్రసాదాన్ని అందించి మాట్లాడుతూ వేడుకలకు వేదికగా అనాధాశ్రమంలో జరుపుకోవాలని ఆలోచన గొప్పదని, బొట్టా సాయికుమార్ సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొట్ట సాయికుమార్ కుటుంబసభ్యులు, అనురాగనిలయ నిర్వాహకులు, డా.నిక్కు అప్పన్న, రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.




## ముఖ్యమంత్రిని కలిసిన ఎంజీఆర్



(సత్యంన్యూస్, పాతపట్నం)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉద్దానం ఫేజ్-2 పనులు త్వరితగతిన అన్ని మండలాల్లో ప్రారంభించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. వంశధార బ్యారేజ్, ప్రధాన కాలువలు మరమ్మతులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. పాతపట్నం నియోజకవర్గంలో ఉద్దానం ఫేజ్-2 జలజీవన్ మిషన్ 265 కోట్లు నిధులతో ఇంటింటికి కుళాయి పనులు త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. వంశధార గొట్ట బ్యారేజ్ మరమ్మత్తులతో పాటు కుడి,ఎడమ ప్రధాన కాలువల మరమ్మతులకు నిధులు వెచ్చించాలని వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా నియోజకవర్గం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.



జెమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో రూరల్ మండలం పెద్ద గనగల వానిపేట గ్రామంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బర్రి రామారావు, ఎంపీటీసీ చీకటి అమ్మోజిరావు, డాక్టర్స్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## స్వర్ణాంధ్ర దిశగా సుపరిపాలన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర దిశగా సుపరిపాలన సాగిస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నగరంలోని 213 బూత్ బుచ్చిపేటలో బుధవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి, వారి నుంచి సమస్యలు నమోదు చేసుకున్నారు. సూపర్ సిక్స్ లోని పథకాల అమలు పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తపరిచారు. రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. ఈ సందర్భంగా పీఎంజే బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచి అగ్రగామిగా నిలవాలని నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలన అంతా అవినీతి, దోపిడీలు, దౌర్జన్యాలు మితిమీరిపోయి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసారని ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు గాడితప్పిన పాలనను గాడిలో పెట్టి అభివృద్ధి సంక్షేమం వైపు దృష్టి సారించి ప్రజా సంక్షేమమే పరమావధిగా ధృడ సంకల్పంతో ఉన్నారన్నారు. దీనిని ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రెండో డివిజన్ ఇన్‌చార్జి అక్కేన రాజారావు, మజ్జి జగన్, రెడ్డి శివ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలను తెలుసుకోవడమే సుపరిపాలన లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం నియోజకవర్గం రూరల్ మండలం కల్లేపల్లి, పెద్ద గనగళ్ల వాని పేట గ్రామాలలో పార్టీ శ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేశాం కాబట్టే ధైర్యంగా తొలి అడుగుతో ప్రజల మధ్యకు వచ్చామన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉండే నాయకులు, వార్డు ఇన్‌చార్జ్‌లు నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గ్రామా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ఎవరికీ ఎవరూ ఏమీ కారు..
# ఎవరి జాగ్రత్తలో వారుండాలి!!

**ఇదొక గుణపాఠం! ఇండస్ట్రీ రాలేదని తప్పు పట్టక్కర లేదు. రెండు కులాల అధిపత్యాలు, ఉన్నోళ్లు లేనోళ్ళు, చిన్న నటుడు పెద్ద నటుడు ఇలా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు తమ అనవసర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు! వారి వారి "వంటలు" చూసాక అవసరమైన నా భావాన్ని నా ఆలోచనను రాయాలనిపించింది! వాళ్ళది అనవసరం, నాది అవసరం అని వూరికే అనలేదు! దానికొక రీజన్ వుంది! చదివాక మీకు అర్థం అవుతుంది!**



ఫిష్ వెంకట్ కుమార్తె మాట్లాడుతూ "నాన్న నటించిన సినిమాల్లో హీరోలు స్పందిస్తారనుకున్నా, ఎవ్వరూ పట్టించుకోలేదు. నాన్నతో నటించని విశ్వక్‌సేన్, కృష్ణ మాండ్యా చెరో రెండు లక్షలు ఇచ్చారు. మంత్రి శ్రీహరి లక్ష ఇచ్చారు, మైనంపల్లి రెండు లక్షలు ఇచ్చారు! వీటితో కిడ్నీ వస్తదా? గతంలో పవన్ కళ్యాణ్ రెండు లక్షలు ఇచ్చారు. ఈసారి ఏమివ్వలేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తనే మళ్ళీ.. మీడియా ముందు మేం చూసుకుంటామని చెప్పే వారే అందరూ, ఆ తరువాత పట్టించుకున్న వారు లేరు అని చెప్పింది. నటుడు ఫిష్ వెంకట్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ చనిపో యారు! అడ్డగుట్ట స్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి! ఇండస్ట్రీ మొత్తం వచ్చి నివాళులు అర్పించలేదు అనేది కొన్ని మీడియాల ఆవేదన!

ఇండస్ట్రీ మొత్తం అసలు ఎందుకొస్తుంది? ఎందుకు రావాలని కోరుకుంటున్నారు? కోట శ్రీనివాసరావుకు వచ్చారుగా అని ఒక మిత్రుడు నాకు ఎదురు ప్రశ్న వేశాడు! తెలుగు సినీ రంగంలో కోట శ్రీనివాసరావు, ఫిష్ వెంకట్ ఒక్కటేనా? తెలియనంత చెప్పలేనంత తేడా వుంది!

పోనీ, ఇద్దరూ సమానమే అని కాసేపు అనుకుందాం! మెయిన్ మీడియా కోట ఇంటి దగ్గర లైవ్ పెట్టారు! మరి ఫిష్ వెంకట్ ఇంటి దరిదాపులకైనా వెళ్ళారా? అక్కడకు వచ్చింది కేవలం వ్యూయర్స్ పెంచుకునే యుట్యూబర్లు మాత్రమే హడావిడి చేశారు! అదే తేడా!

ఇండస్ట్రీలో కులం కాదు! ఒక ప్రముఖ నిర్మాత, దర్శకుడు, నటుడు, సాంకేతిక నిపుణుడు చనిపోతేనే ఇండస్ట్రీ తరలి వస్తుంది! మనం ఎన్నో ఏళ్లుగా చూస్తూనే ఉన్నాం! చిన్న చిన్న నటులు ఎందరో చనిపోయారు! టివిల్లో సరేసరి, కనీసం పత్రికల్లో సింగిల్ కాలమ్ వార్తకు నోచుకోలేదు!



అంతెందుకు కీరవాణి తండ్రి శివశక్తి దత్తా చనిపోతే ఎంతమంది సందర్శించారు! బెంగళూరులో సీనియర్ నటి సరోజా దేవి చనిపోతే ఒక్కరైనా వెళ్ళారా? వెళ్ళలేదు! జమున అంతిమ యాత్ర ఆ ఒక్క రథం ఒంటరిగా వెళ్ళింది! సినిమాను కొద్దో గొప్పో ప్రభా వం చూపిస్తే సరిపోదు! కొన్ని ఈక్వేషన్స్ ఉండాలి! వేవ్ లెంత్ సరిపోవాలి! సైడ్ విలన్ లేదా చిన్న చిన్న పాత్రలు వేసే నటులు చనిపోయినా ఇండస్ట్రీ తరలి రావాలనుకోవడం, రాలేదని దెప్పి పొడవడం అనవసరం! పెద్ద నటులకే రాలేదు! ఇండస్ట్రీ అంతా ఒకే కుటుంబం అని వేదికలపై అన్నంత మాత్రాన కుటుంబ సభ్యులమే అని అనుకోవడం తప్పు!

ఫిష్ వెంకట్ అనేక సినిమాల్లో సైడ్ విలన్, గ్రూప్ విలన్, అసిస్టెంట్ విలన్ పాత్రలు వేసి తనదైన తెలంగాణ యాసలో డైలాగులు చెప్పి ఆకట్టుకున్నాడు! అమాయకంగా నవ్వించి గుర్తింపు పొందాడు! వూరికినే ఏమీ నటించలేదు! చేపల వ్యాపారం కూడా వదిలేసి సినిమాల్లో బిజీ అయిపోయే అంతగా సంపాదించాడు! నిలబెట్టుకోలేకపోయాడు, అది వేరే విషయం!

మొన్నటికి మొన్న "అన్నం తిని నాలుగు రోజులు అయ్యింది" అని కంట తడి పెట్టిన పాకీజా కూడా అంతే! ఎవ్వరూ వూరికే నటించ లేదు! పాపం ఆమెకు పడిన సినిమాలు కూడా తక్కువే! ఆమె ఏం సీనియర్ నటి కాదు! ఉండేది తమిళనాడులో! గతంలో తెలుగు సినీ పరిశ్రమలో కొందరు సాయం చేశారని, మళ్ళీ వచ్చి మీడియా ముందు కన్నీళ్లు పెడితే, పవన్ కళ్యాణ్ స్పందించి రెండు లక్షలు ఇచ్చి పంపించారు! అదొక అలవాటుగా మారిపోయింది ఆమెకు!

ఫిష్ వెంకట్ చనిపోయాడు కాబట్టి అనకూడదు, కానీ మిగిలినవారికి కొంత గుణపాఠం అవుతుందనే ఉద్దేశ్యంతో కొంత సాహసం చేయాల్సి వస్తోంది! ఒక రకంగా చెప్పాలంటే "వద్దు" అని ఇంటా బయటా చెప్పినా వినకుండా మందుకు బానిస అయిపోయాడు! సంపాదించింది సంపాదించినట్లుగా ఇష్టారాజ్యాంగా ఖర్చు పెట్టేసాడు! రోజుకు 35 గుట్కాలు నమిలేవాడ్ని అనే తనే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నాడు!

ఆరోగ్యం దెబ్బతింటున్నా లెక్క చేయలేదు! "మనల్ని ఎవడ్రా ఆపేది" అన్నట్లు తాగి గ్యాంగ్రిన్, అఖరకు కిడ్నీలు పాడైపోయే స్థితికి చేరుకున్నాడు! వేరే ఆసుపత్రిలో చేరిస్తే రోజుకు 70వేలు అవుతూ వచ్చింది! కొందరు దాతలు సహకరించారు! ప్రభుత్వం కూడా స్పందించింది. అఖరకు మంత్రి శ్రీహరి కూడా సందర్శించి పరామర్శించి, సొంత డబ్బులు కొంత ఇచ్చి, ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు! ఆ ఆసుపత్రిలో కాస్త ఇబ్బందిగా ఉందని వారి బంధువుల అసువత్రికి మార్చి కిడ్నీ డోనర్ కోసం వెతుకుతున్న సమయంలో దురదృష్టవశాత్తు ఆయన కనుమూశారు! ఆయన సహచర నటులు మిత్రులు పెద్ద ఎత్తున వచ్చారు. నివాళులు అర్పించారు! కానీ, ఇండస్ట్రీ నుంచి పెద్దలు ఎవ్వరూ రాలేదని, ఎందుకు పట్టించుకోలేదని నటులు ఎవ్వరూ చెప్పలేదు! కేవలం మీడియా మాత్రమే ఆ అనవసరపు గొంతుక వినిపించింది!

ఫిష్ వెంకట్ అన్ని సినిమాల్లో నటించాడు కానీ, "మా" సభ్యత్వమే తీసుకోలేదు! "మా" సభ్యుడు కాకపోయినా ఆ సంస్థ స్పందించింది! అసలు మా సంస్థలో సభ్యత్వం తీసుకుని ఉంటే ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉండేది!


చిన్న చిన్న ఉద్యోగాలు చేసే వాళ్ళు కూడా ఆరోగ్యంగా ఉండాలని అనేక జాగ్రత్తలు తీసుకుంటున్న రోజులు! సొంత ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటున్న రోజులు! కానీ, ఫిష్ వెంకట్ అవేమి పట్టించుకోక పోవడం విచారకరం!

ఫిష్ వెంకట్ మృతి సినీ రంగంలో ఉన్న చిన్న చిన్న నటులకు పెద్ద గుణపాఠం కావాలి! గబ్బర్ సింగ్ కామెడీ విలన్లు నిన్న వెంకట్ అంతిమ యాత్రలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఫిష్ వెంకట్ ఆసుపత్రిలో వున్నప్పుడు కొందరు నటులు మానవతా దృక్పథంతో సాయం చేశారు! అలా సాయం చేస్తారులే అని భరోసాగా ఉండకండి! ఫిష్ వెంకట్ కుమార్తె చెప్పినట్లు ఎవ్వరూ ఎవ్వరికీ ఏమీ చేయరు! మాట సాయం చేయగలరేమో కానీ, ఆర్థిక సాయాలు అందరూ చేయరు! చేసినా వాటి ఈక్వేషన్స్ వాటికి ఉంటాయి! అసలు వాళ్ళు వీళ్ళు సాయం అని ఆలోచించకుండా అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి!

సంపాదించింది ఖర్చు పెట్టేయకుండా అందులో కొంత దాచుకోవాలి! మెడికల్ ఇన్సూరెన్స్ ప్రతి కుటుంబానికి ఉండేలా చూసుకోవాలి! అన్న ఫిష్ వెంకట్ పోయి, అందరికి కళ్ళు తెరిపించాడనుకోవాలి! అందరూ జాగ్రత్తగా ఉండాలి! నాకు మీకు అందరికి ఇది వర్తిస్తుంది!

-డా.మహ్మద్ రఫీ

# మన బాపూజీ బొమ్మకు ఎందుకంత డిమాండ్..?



చూడాలని, గాంధీని తమ చిత్రాల్లో గీయాలని, గాంధీతో మాట్లాడాలని, కలిసి నడవాలని ప్రపంచవ్యాప్తంగా కూడా ఆయనకెంత క్రేజ్ ఉండేదో ఈ సందర్భం వెల్లడించింది. అయితే, ఆయన్ను లైవ్లీగా చిత్రీకరించిన ఈ పోట్రెయిట్ కచ్చితంగా ఓ హిస్టారికల్ డాక్యుమెంటనే చెప్పుకోవాలి.

దాదాపు ఆర్టిస్టులంతా అటెంప్ట్ చేసే పోట్రెయిట్స్‌లో మహాత్మా గాంధీకి కూడా కచ్చితంగా ఓ స్థానముండే ఉంటుంది. కానీ, నేరుగా మహాత్మాగాంధీనే కూర్చోబెట్టి వేసిన ఆయన ఒకే ఒక్క పోట్రెయిట్ ఇప్పుడు రూ.1.70 కోట్లకు అమ్ముడైంది. వేలంలో ఎవరు దాన్ని కొనుగోలు చేశారనే విషయాన్ని ఆ ఫైన్ ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు వెల్లడించలేదు గానీ.. గాంధీ లైవ్లీ పోట్రెయిట్ చిత్రీకరణ వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. ఆ వివరాలేంటో తెలుసుకుందాం. లండన్‌లోని బోన్ హామ్స్ ఫైన్ ఆర్ట్ గ్యాలరీ వేలంలో మన మహాత్మాగాంధీ ఆయిల్ పెయింటింగ్ పోట్రెయిట్‌కు అంత విలువ దక్కింది. దాని ధర.. 152,800 పౌండ్లు.. అంటే, ఇండియన్ కరెన్సీలో అక్షరాలా రూ.1.70 కోట్లన్న మాట. అంతకుముందెప్పుడూ వేలంలో ప్రదర్శించబడని గాంధీని నేరుగా కూర్చోబెట్టి వేసిన పెయింటిగ్‌కు ఆన్‌లైన్ వేలం నిర్వహించడంతో పాటు.. 50వేల నుంచి 70వేల పౌండ్ల మధ్య ధరతో ఆఫర్ చేశారు. మొన్న ఈ మంగళవారం (జులై 15న) ఈ వేలాన్ని నిర్వహించగా.. ట్రావెల్ అండ్ ఎక్స్‌ప్లోరేషన్ సేల్ పేరిట నిర్వహించిన ఆ ఆన్‌లైన్ వేలం పాటలో గాంధీ పోట్రెయిట్‌కే ఎక్కువ ధర పలికింది.

మహాత్మాగాంధీ పోట్రెయిట్‌ను ఆయన్ను కూర్చోబెట్టి లైవ్లీగా చిత్రీకరించిన ఆర్టిస్ట్ పేరు క్లేర్ లైటన్. గాంధీ లండన్‌కు వెళ్లిన సమయంలో ఈ పోట్రెయిట్ గీచే సందర్భం చిక్కింది. గాంధీని

1931లో క్లేర్ లైటన్ అనే పెయింటర్ కమ్ రైటర్.. గాంధీని కలిసినప్పుడు ఈ అవకాశం దక్కింది. గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావడానికి లండన్‌కు వెళ్లినప్పుడు క్లేర్ లైటన్‌కు గాంధీతో పరిచయం ఏర్పడింది. 1989లో ఆమె మరణించే వరకూ కూడా ఆ గాంధీ పెయింటింగ్ ఆమె వద్దే ఉంది. ఆ తర్వాత ఆమె కుటుంబం బోన్ హామ్స్ ఫైన్ ఆర్ట్స్ గ్యాలరీకి అందజేసింది.

హెన్రీ నోయెల్ బ్రెయిల్స్ ఫోర్డ్ అనే లండన్‌కు చెందిన పొలిటికల్ జర్నలిస్ట్.. గాంధీజీ అన్నా, ఆయన పోరాటమన్నా బాగా ఇష్టపడేవాడు. 1930లో ఇండియాకు కూడా వచ్చి గాంధీ చేస్తున్న పోరాటాల గురించి తెలుసుకుని మద్దతు తెలిపాడు. ఆ తర్వాత రెబెల్ ఇండియా అనే ఓ పుస్తకాన్ని కూడా ప్రచురించారాయన. ఆ సమయంలోనే రౌండ్ టేబుల్ సమావేశానికి వచ్చిన గాంధీతో ఆయనకు మంచి పరిచయం ఏర్పడింది. బ్రెయిల్స్ ఫోర్డ్‌కు.. క్లేర్ లైటన్ స్నేహితురాలు కావడంతో గాంధీకి లైటన్‌నూ పరిచయం చేశాడు బ్రెయిల్స్ ఫోర్డ్.

బ్రెయిల్ ఫోర్డ్‌తో పాటే గాంధీతో పరిచయం బలపడిన క్లేర్ లైటన్ తరచూ గాంధీ ఉండే కార్యాలయానికి వెళ్లేవారు. అలా ఆయన స్కెచ్ వేయడానికి క్లేర్ లైటన్ అనుమతి తీసుకుంది. కానీ, ఒక్కసారితో గాంధీ స్కెచ్ అండ్ పెయింటింగ్ పూర్తి కాలేదు. పలుమార్లు గాంధీని కలిసిన పలు సిట్టింగ్స్‌లో ఆయన స్కెచ్ గీసి.. ఆ తర్వాత దాన్ని ఆయిల్ పెయింటింగ్‌గా తీర్చిదిద్దారు క్లేర్ లైటన్. ఈ విషయాలని బోన్ హామ్స్ ఫైన్ ఆర్ట్ గ్యాలరీ నిర్వహాకులే వెల్లడించారు.

### ఒక పెయింటిగ్ ఎగ్జిబిషన్‌లో గాంధీ పోట్రెయిట్ ప్రదర్శన!

1931 నవంబర్‌లో లండన్‌లోని అల్బానీ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన ప్రదర్శనలో లైటన్ తాను వేసిన గాంధీ పోట్రెయిట్‌ను కూడా ప్రదర్శనకు పెట్టారు.

అప్పుడు మరో బ్రిటీష్ జర్నలిస్ట్ వినిఫ్రెడ్ హోల్ట్ బై ఆ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ట్రేడ్ యూనియన్ మ్యాగజైన్ అయిన ది స్కూల్ మిస్ట్రెస్ కోసం ఆయన పెయింటింగ్ ప్రదర్శనను గురించి ఓ కాలమ్ కూడా రాశారు. పార్లమెంట్ సభ్యులు, మాజీలు, కళాకారులు, జర్నలిస్టులు, కళా విమర్శకులు, చీరల్లో ప్రకాశవంతంగా మెరిసిపోతున్న భారతీయ మహిళలు, కొందరు హిందూ ప్రతినిధులు హాజరైన ఆ కార్యక్రమంలో రాజనీతిజ్ఞురాలు, కవయిత్రి నాయుడు.. అలాగే, మహాత్మగాంధీ కొలీగ్ అయిన పురుషోత్తమ్ దాస్ ఠాకూర్ కూడా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

అయితే, ఆ ప్రదర్శనకు స్వయానా గాంధీ కూడా హాజరు కావల్సి ఉన్నా.. ఆయన వెళ్లలేకపోయాడు. అయితేనేం, గాంధీ ఆయిల్ పెయింటింగ్ పోట్రేయిట్ మాత్రం అందరినీ ఆకట్టుకుంది. గాంధీజీ ఏదో చెబుతున్నట్టుగా.. నిండుగా పంచె కప్పుకున్న ఆ పోట్రెయిట్ చూస్తుంటే ఆయనే స్వయంగా వచ్చాడా అన్నట్టుగా ఫీల్ అయ్యారట జర్నలిస్ట్ వినిఫ్రెడ్ హోల్ట్ బై. ప్రపంచమంతా గౌరవించే రాజకీయ నాయకుడు, సమస్యలను సులువుగా పరిష్కరించగలిగే సంధానకర్త, తెలివైన న్యాయవాది, స్నేహితులైనా, శత్రువులైనా వారిని తన మాటలతో ఎలా లొంగదీసుకోవచ్చో తెలిసిన రాజనీతిజ్ఞుణ్ని నిజంగానే చూసినట్టనిపించింది ఆ పోట్రెయిట్ చూస్తే అంటూ ఒక పెద్ద ఆర్టికలే రాశారు వినిఫ్రెడ్.

ఆ పోట్రెయిట్‌కు మంచి ఆదరణ దక్కడంతో.. గాంధీజీ వ్యక్తిగత కార్యదర్శి మోహదేవ్ దేశాయ్ నుంచి లండన్ పెయింటర్ లైటన్‌కు ఓ లేఖ వచ్చింది. దాని డూప్లికేట్ కాపీ చిత్రమొక్కటి గాంధీకి పంపించాలని ఆ లేఖలో కోరారట దేశాయ్. అల్బానీ గ్యాలరీలో మీరు వేసిన గాంధీ పెయింటింగ్ చూసిన నా మిత్రులెందరో.. ఎలాంటి పోలికలు మిస్ కానంతగా మీ పెయింటింగ్ ఉందని చెప్పారు. దాన్ని మరో కాపీ పంపగల్గితే బాగుంటుందనేది ఆ లేఖ సారాంశం.

### ఇంతకీ ఆ ఆర్టిస్ట్ క్లేర్ లైటన్ ఎవరు?

క్లేర్ లైటన్ ఒక అమెరికన్ కళాకారిణి. రచయిత్రి, ఓ ఆర్టిస్. లండన్‌లో జన్మించిన క్లేర్ లైటన్.. రాబర్ట్ లైటన్, మేరీ కానర్ లైటన్ అనే రచయితలైన దంపతుల కుమార్తె. క్లేర్ చిన్ననాటి జీవితం తన అన్న రోలాండ్‌తో పాటే సాగింది. క్లేర్ లైటర్‌ను ఆమె మామ జాక్ లైటన్ చిత్రలేఖనం వైపు ప్రోత్సహించాడు. 1915 పలు కళాశాలల్లో చిత్రలేఖనంలో ఫైన్ ఆర్ట్స్ కోర్సులు చేసింది. 1938లో పోస్టర్ డిజైనింగ్, ఆ తర్వాత ఇంగ్లాండ్‌లోని పలు చర్చీల్లో స్టెయిన్డ్ గ్లాస్ కిటికీల పెయింటింగ్స్‌లోనూ క్లేర్ లైటన్ పెయింటర్‌గా వ్యవహరించింది.

### 1974లో బయటకొచ్చిన గాంధీ పోట్రెయిట్!

1978లో బోస్టన్ పబ్లిక్ లైబ్రరీలో లైటన్ రచనల ప్రదర్శన నిర్వహించే వరకూ కూడా.. లైటన్, గాంధీకి సంబంధించిన ఓ పోట్రెయిట్ పెయింటింగ్ గీసిందనే విషయం చాలామంది మర్చిపోయారు, ఇంకొందరికి అసలు తెలియనే తెలియదు. 1974లో ఆ పోట్రెయిట్ ప్రదర్శన కోసం తెస్తున్నప్పుడు ఓ అతివాది కత్తితో దాడికి పాల్పడినట్టు ఆర్టిస్ట్ లైటన్ కుటుంబీకులు చెప్పినదాన్ని బట్టి తెలుస్తోంది. దాంతో ఆ ఫోటో కాస్త దెబ్బతిందట. వెంటనే ఆ పోట్రెయిట్‌ను 1974లో లైమాన్ ఆలిన్ మ్యూజియం కన్జర్వేషన్ ల్యాబ్ పునరిద్ధరించింది.

- బాతాఖానీ సౌజన్యంతో..

## అచ్చుతానందన్‌కు సీపీఎం నివాళి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఐ(యం) పూర్వ పోలిట్‌బ్యూరో సభ్యులు వి.ఎస్.అచ్యుతానందన్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళులు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. అచ్యుతానందన్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ సంతాప సభను శ్రీకాకుళం సిపిఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడిగా అనేక పోరాటాల్లో కీలకమైన వ్యక్తిగా వ్యవహరించారని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో ప్రజల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.ప్రసాదరావు, సిటు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, కార్యదర్శి ఎన్.వి.రమణ, కోశాధికారి అల్లు సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాష్, ఏ.సోమశేఖర్, శ్రీనివాసరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి గ్యాస్ స్టౌ వితరణ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో ఖ్యాతి ఫౌండేషన్ పేరుతో నడుస్తున్న వృద్ధాశ్రమానికి ప్రముఖ దాత ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు స్టీల్ గ్యాస్ స్టౌ అందజేశారు. ద్వారకానగర్‌లో ఉన్న ఈ వృద్ధాశ్రమంలో 15 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆహారం తయారు చేసేందుకు వినియోగించే స్టౌ పాడైపోయిందని, నిధుల కొరత వల్ల కొత్తది కొనుగోలు చేయలేకపోతున్నామని, సహాయం చేయాలని నిర్వాహకురాలు శ్రావణి చేసిన విజ్ఞప్తి మేరకు మొత్తం రూ.5 వేల విలువైన స్టౌ, దానికి సంబంధించిన ఇతర పరికరాలను బుధవారం అందజేశారు.

## ప్రసార విప్లవం ప్రారంభమైన రోజు ఇది

**- ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు -**



2018లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గురించి ఆకాశవాణి వ్యాఖ్యతతో కలసి శ్రీకాకుళం నుంచి ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాన్ని వ్యాఖ్యానాన్ని అందిస్తున్న వావిలపల్లి జగన్నాథ నాయుడు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సామాన్య ప్రజానీకానికి వార్తా విశేషాలను అందించడానికి, తాజా సమాచారాన్ని తెలియచేయడానికి, కళలు, సంస్కృతి, వ్యవసాయం తదితర విషయాలపై అవగాహన పెంచడానికి భారతదేశంలో భారత బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్‌గా మొట్టమొదటి ఆకాశవాణి కేంద్రం బొంబాయిలో 1923 జులై 23న ప్రారంభమైందని ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు అన్నారు. ప్రచార సాధనాల్లో ఇది ఒక విప్లవాత్మకమైన మార్పుగా ఆయన పేర్కొన్నారు. జాతీయ ప్రసార దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు, ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో నాటి ఆకాశవాణి, నేటి ప్రసార భారతి గొప్ప సేవలను అందించిందని అన్నారు. 1923 జులై 23న బొంబాయిలో మొట్టమొదటి రేడియో స్టేషన్ ప్రారంభమైందని, ఆరోజే ప్రసారాలను కూడా ప్రారంభించిందని, అప్పటి నుంచి భారత్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ పేరుతో ప్రారంభించబడి, ఆ తర్వాత ఆకాశవాణిగా మారి, తదుపరి ప్రసార భారతిగా పేరు మార్చుకొని తన వారసురాలిగా దూరదర్శన్‌ను మనకు అందించిందని తెలిపారు. సామాన్యుడికి సమాచారాన్ని అందించే విప్లవాత్మకమైన సమాచార వ్యవస్థని అందించిన రోజుగా మనం పేర్కొనవచ్చన్నారు.

## కార్గిల్ విజయ దివస్ స్మారకోత్సవం

- 25న ఎక్స్‌సర్వీస్‌మెన్ ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం
- 26న వీరమాతలకు, వీరనారీమణులకు సత్కారం
- ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు కటకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్గిల్ విజయ దివస్ స్మారకోత్సవాన్ని డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు కటకం తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25న మహా రక్తదాన శిబిర కార్యక్రమం, 26న కార్యేషు ఈవెంట్స్ సౌజన్యంతో విశాఖపట్నంలో వీరమాతలకు, వీర నారీమణులకు సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 25న ఉదయం 8.30 గంటలకు డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ శ్రీకాకుళం వారి సౌజన్యంతో బ్లడ్ డొనేషన్ క్యాంపును పెద్దరెల్లివీధిలో నిర్వహించడానికి నిర్ణయించినట్టు తెలిపారు. తాము దేశ సేవ చేసి వచ్చిన తర్వాత ఏదో విధంగా సమాజానికి తమ వంతు బాసటగా ఉండాలని కోరుకుంటూ మాజీ సైనికులు కూడా సామాజిక సేవలో భాగస్వామ్యులు కావాలనే ముఖ్య ఉద్దేశ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. అలాగే 26న విశాఖలో కార్యేషు ఈవెంట్స్ అనే మహిళా సాధికారిక సంస్థ ఆపరేషన్ సింధూర్ తర్వాత వీరమాతలకు, వీర నారీమణులకు 'మా క్షేమం.. మీ త్యాగం.. మా ధైర్యం' అనే నినాదంతో శ్రావణ సఖి 4వ ఎడిషన్‌లో భాగంగా చందన మోహన రావు ఫంక్షన్ హాల్ వెంకోజి పాలెంలో సత్కారం చేయాలని ముందుకు వచ్చారు. వీరమాతలకు, వీర నారీమణులకు క్యాష్ అవార్డు ఇవ్వడమే కాకుండా వెళ్లి రావడానికి బస్సు ఏర్పాట్లు చేయడం పట్ల సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రతీ మాజీ సైనికుడు, వీర నారీమణి, వారి కుటుంబ సభ్యులు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానానికి హాజరయ్యేవారు తమ పేర్లను 94394 56757 నెంబర్‌లో 'మేము సైతం' అని నమోదు చేసుకోవాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆ ప్రకటనలో పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు.

## గోవా గవర్నర్‌ను కలిసిన వాసు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గోవా నూతన గవర్నర్‌గా ఇటీవల నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును జిల్లా శిష్టకరణ సంఘ అధ్యక్షుడు, శ్రీకూర్మం ట్రస్ట్‌బోర్డ్ మాజీ సభ్యుడు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) బుధవారం విజయనగరంలోని ఆయన బంగ్లాలో కలిశారు. శ్రీకూర్మం దేవస్థానానికి ధర్మకర్తగా ఉన్న అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కూర్మనాధుని ప్రతిమ, ఆలయంలో పూజలు నిర్వహించిన శాలువను బహూకరించారు.

## విద్యార్థులతో కలిసి భోంచేసిన ఏపీవో

(సత్యంన్యూస్, సీతంపేట)

మెళియాపుట్టి మండలం పీఎల్ పురంలో ఉన్న ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ హాస్టల్‌ను ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించి రుచికరంగా ఉన్నదీ, లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన చిన్నబాబు విద్యా బోధన జరుగుతున్న తీరు, విద్యార్థులకు అర్థమవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఉండాల్సిన గుడ్లు, బియ్యం, పప్పులు వంటివి పరిశీలించి వాటి నాణ్యతను తెలుసుకున్నారు. స్టార్ రిజిస్టర్ మేరకు కూరగాయలు ఉన్నాయా, లేవా చూశారు.



## స్వరాజ్య కెరటం లోకమాన్య తిలక్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వాతంత్ర్యోద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన పోరాటయోధుడు లోకమాన్య బాలగంగాధర తిలక్ అని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో తిలక్ 169వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గాంధీమందిర బృందం నటుకుల మోహన్, నిష్టల నరసింహమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ మందుల మోహనరావు, నక్క శంకరరావు తదితరులు తిలక్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించడంతో పాటు వినాయకచవితి, దుర్గామాత ఉత్సవాలను వాడవాడలా నిర్వహించడం ద్వారా భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన మహోన్నతుడు తిలక్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాంధీమందిర ప్రతినిధులు శాస్త్రి, తర్లాడ అప్పలనాయుడు, మహోదయ మూర్తి, సువ్వారి రాజారావు తదితరులున్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల
అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

# కలెక్టర్‌నే బెత్తం పట్టించిన బది'లీలలు'!

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. తత్ఫలితంగానే కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగారు. డీఎంహెచ్‌వో అధికారులను పిలిపించి చెడుగుడు ఆడేశారు.

☛ఒక్క ఈ శాఖలోనే కాదు జిల్లాలోని మరికొన్ని శాఖల్లోనూ బదిలీలు అవినీతి అక్రమాలతో ప్రహసనంగా మారాయి.

ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసి నెల రోజులు దాటినా జిల్లాలో మాత్రం తెలుగు సీరియల్ మాదిరిగా.. జీడిపాకంలా ఈ తతంగం ఇంకా సాగుతునే ఉంది. ఆయా శాఖల జిల్లా అధికారులు స్వయంగా లేకపోవడం.. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సుతో జిల్లా క్యాడర్ ఉద్యోగాలు వెలగబెట్టడం వల్ల తలెత్తిన ఉపద్రవమే ఈ బదిలీల జీడిపాకం సీరియల్. వైద్య ఆరోగ్యశాఖ, బీసీ సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, సర్వే డిపార్ట్‌మెంట్లలో ఎన్ని బదిలీలు చేశారు? ఎక్కడికి చేశారు? ఎవరు విధుల్లో చేరారు? అన్న వివరాలను ఇప్పటికీ ప్రభుత్వానికి సమర్పించలేకపోయారు. దీంతో హోం వర్క్ చేయని విద్యార్థికి క్లాసులు అయిపోయిన తర్వాత అదనపు గంటలు కూర్చోబెట్టి రాయించినట్టు స్వయంగా జిల్లా కలెక్టర్ దినకర్ పుండ్కర్ కలెక్టరేట్‌లో గతంలో గ్రీవెన్స్ నిర్వహించిన చోట ఈ నాలుగు శాఖల ఉద్యోగులను కూర్చోబెట్టి బదిలీల వివరాలను అప్‌లోడ్ చేయించాల్సి వచ్చింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులతో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కూడా బదిలీ అవకాశం కల్పించింది. దాంతో జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు.. స్థానిక నేతలు, ఇతర వర్గాల నుంచి అందిన ఆబ్లిగేషన్ మేరకు సిఫార్సు లేఖలిచ్చారు. కానీ పైన పేర్కొన్న డిపార్ట్‌మెంట్లలో ఈ లేఖలను పట్టించుకోలేదు. ఒక ఎమ్మెల్యే రెండు సిఫార్సులిస్తే ఒకటి చేశాం.. మరొకటి చేయలేకపోయామని చెప్పడానికి కూడా మొహమాటపడకుండా ఈ సిఫార్సులేఖలను బుట్టదాఖలు చేసేశారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకున్న వారు తమకు న్యాయం జరగలేదని, రోస్టర్ ప్రకారం చేసినా తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీ అయ్యేవారమని, ఎమ్మెల్యేలు లేఖలివ్వడం వల్ల మొత్తంగా బలై పోయామంటూ గగ్గోలు పెట్టారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖలో ఏమాత్రం రూల్ పొజిషన్‌ను చూడకుండా, ప్రభుత్వ జీవోను పరిశీలించకుండా డబ్బులు దండుకొని బదిలీలు చేసేశారు. తీరా రిలీవింగ్ ఆర్డర్ తీసుకొని కొత్త పోస్టులో జాయిన్ కావడానికి వెళ్తే.. అప్పటికే అదే సీటుకు మరో ఇద్దరికి బదిలీ చేసినట్టు తేలిన ఘటనలు వైద్య ఆరోగ్యశాఖలో చోటుచేసుకున్నాయి. అంటే లెక్కాపత్రం లేకుండా వేలం పాట ద్వారా సొమ్ము తీసుకొని ఇష్టారాజ్యంగా బదిలీలు చేసేశారన్న మాట. ఇది ఆరోపణ మాత్రమే కాదు. బదిలీలు జరుగుతున్నప్పుడు గ్రేడ్-3 ఏఎన్ఎంలు నిరసన తెలుపుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఆ తర్వాత జిల్లా ఉద్యోగుల జేఏసీ నాయకుడు హనుమంతు సాయిరామ్‌ను తీసుకొని జిల్లా కలెక్టర్‌ను కలిసి సొమ్ము తీసుకొని బదిలీలు చేశారని, అవి కూడా సవ్యంగా జరగలేదని ఏఎన్ఎంలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినా వైద్యఆరోగ్యశాఖ అధికారులు తమ తప్పు దిద్దుకోలేదు. తాజాగా ఒక్కో ప్లేస్‌కు ఇద్దరిద్దరికి పోస్టింగ్ ఇచ్చారని తేలడంతో చాలామంది జాయినవ్వలేకపోయారు.

### ఒకే పోస్టు.. ఇద్దరు ఏఎన్ఎంలు

దీంతో కలెక్టర్ డీఎంహెచ్‌వో ఆఫీస్ కంప్యూటర్‌తో సహా అక్కడి సిబ్బందిని కలెక్టరేట్‌కు రప్పించి ఇంతవరకు బదిలీల జాబితా ఎందుకు అప్‌లోడ్ చేయలేదని ప్రశ్నించారు. దీనికి ఎవరి వద్దా సమాధానం లేదు. అదే సమయంలో ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన ఏఎన్ఎం విమలకుమారి అక్కడికి చేరుకొని జీడిపప్పుతో పాటు రూ.15వేలు ముట్టజెప్పినా తనకు న్యాయం చేయలేదంటూ ఉద్యోగుల ఎదురుగానే కలెక్టర్‌కు చెప్పారు. జీడిపప్పు ఇచ్చిన మాట వాస్తవమే గానీ డబ్బులు మాత్రం ఇవ్వలేదంటూ దాబాయించిన సిబ్బంది.. కలెక్టర్ వెళ్లిపోయిన తర్వాత విమలకుమారికి చెందిన ఫోన్ తీసుకొని మీడియాకు చెప్పకుండా అక్కడే కూర్చోబెట్టి న్యాయం చేస్తామంటూ ఆమెతో కాళ్లబేరానికి వచ్చినట్టు తెలిసింది. కాగా కారుణ్య నియామకం కింద 2023లో తులసమ్మ అనే గ్రేడ్-3 ఏఎన్ఎంకు పోస్టింగ్ ఇచ్చారు. ఆర్డర్‌లో ఈమెకు మురపాక కేటాయించినట్టు చూపిస్తునే కంచిలి మండలం మాణిక్యపురానికి డిప్యూటేషన్‌పై పంపించారు. తాజా బదిలీల్లో స్థానం మారడానికి ఆమెకు అవకాశం లేదు. ఎందుకంటే.. విధుల్లో చేరి రెండేళ్లే అయింది. సచివాలయ ఏఎన్ఎంలు ఐదేళ్లు దాటితేనే బదిలీకి అర్హత సాధించారు. కానీ ఈమె వచ్చి రెండేళ్లే అయింది. ఆ సంగతి అలా ఉంటే.. ఖాళీ ఉందా? లేదా? అని చూడకుండా ఇటు మాణిక్యపురానికి, అటు మురపాకకు రెండింటికీ ఇద్దరు ఏఎన్ఎంలను బదిలీ చేసేశారు. ఇప్పుడు తులసమ్మకు ఎక్కడికి పోవాలో అర్థం కావడంలేదు. న్యాయంగా తన పోస్టింగ్ మురపాకలో అక్కడ ఉంచలేదు. పోనీ డిప్యూటేషన్‌లో ఇన్నాళ్లు ఉన్న మాణిక్యపురంలోనైనా ఉంచారా? అంటే అదీ లేదు. దీంతో తన గోడు వినిపించుకోడానికి బుధవారం ఆమె డీఎంహెచ్‌వోను కలవడానికి వెళ్లారు. అక్కడి అధికారులు తమ తప్పిదాన్ని ఒప్పుకోకుండా తిరిగి తులసమ్మనే దబాయించి ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి బదిలీ చేస్తామని.. ఇష్టముంటే ఉద్యోగం చేయమని కష్టమైతే మానేయమని కసురుకోవడంతో ఆ ఒంటరి మహిళ కన్నీటి పర్యంతమైంది. దీనికి సరిగ్గా 24 గంటల ముందే కలెక్టర్ దినకర్ పుండ్కర్ డీఎంహెచ్‌వోతో పాటు బదిలీ బోర్డు మొత్తాన్ని కడిగిపారేసినా వారి తీరు ఏమాత్రం మారలేదు.

### విధులకు దూరంగా వార్డెన్లు

సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో అయితే మరీ దారుణం. ఈ శాఖ బదిలీ జాబితాపై కలెక్టర్ ఆమోదముద్ర వేసినా ఒక్క వార్డెన్ కూడా బదిలీ అయిన స్థానాల్లో డ్యూటీలు చేయకపోవడం గమనార్హం. బదిలీ ప్రాంతాల్లో విధుల్లో చేరినట్లు ఫొటోకు ఓ స్టిల్ ఇచ్చి.. ఆ తర్వాత ఎంచక్కా విధులకు వెళ్లడం మానేశారు. నాలుగు రోజులు ఆగితే వాతావరణం చల్లబడుతుందని, అప్పుడు కలెక్టర్ కళ్లుగప్పి, మీడియాకు ముడుపులిచ్చి మళ్లీ ఎవరి స్థానంలో వారు సర్దుకోవచ్చన్న ధీమాతో వార్డెన్లంతా దన్నుపెట్టి పడుకున్నారు. రణస్థలం వార్డెన్ సుజాతకు ఆమదాలవలస, ఆమదాలవలస వార్డెన్ నళినీకుమారికి రణస్థలం బదిలీ అయింది. అలాగే నరసన్నపేటలో పనిచేస్తున్న సూర్యప్రభకు టెక్కలి, టెక్కలిలో పని చేస్తున్న విజయలక్ష్మికి సోంపేట, సోంపేటలో పని చేస్తున్న విజయలక్ష్మికి నరసన్నపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. వీరెవరూ ఇప్పటికీ విధుల్లో చేరలేదు. అలాగని ఈ మధ్యే బదిలీ అయి.. మళ్లీ బదిలీవేటు పడినవారా? అంటే.. అదీ కాదు. ఇందులో ఒక్కొక్కరు ఏడు నుంచి తొమ్మిది ఏళ్ల వరకు ఒకే చోట పాతుకుపోయినవారే. ఇప్పుడు స్థాన చలనానికి ఏమాత్రం అంగీకరించడంలేదు.

### ఈ చేత్తో బదిలీ.. ఆ చేత్తో డిప్యూటేషన్

బీసీ సంక్షేమ శాఖలో బదిలీలను రెండు రకాలుగా క్యాష్ చేసుకున్నారు. కోరుకున్న చోటికి బదిలీ చేసినందుకు ఒకసారి సొమ్ము తీసుకోగా, ఇప్పుడు బదిలీ అయిన చోటు నుంచి డిప్యూటేషన్ మీద వేరే చోటకు వెళ్లడానికి మళ్లీ సొమ్ములు వసూలు చేసేశారు. డబ్బుల మాయలో పడి నిబంధనలను పూర్తిగా విస్మరించేశారు. ప్రస్తుతానికి నిన్నకాక మొన్న బదిలీ అయిన ఆరుగుర్ని అప్పుడే డిప్యూటేషన్ మీద నచ్చిన చోటికి పంపించేశారు. పలాసలో కాలేజ్ హాస్టల్ వార్డెన్‌గా ఉన్న ఉపేంద్రను రణస్థలం కాలేజ్ హాస్టల్‌కు బదిలీ చేశారు. ఆ వెంటనే డిప్యూటేషన్ మీద మఠంసరియాపల్లి ప్రీమెట్రిక్ హాస్టల్‌కు పంపించారు. దీనికి తోడు రాజపురం ప్రీమెట్రిక్ హాస్టల్‌ను అదనంగా ఆయనకే అప్పజెప్పారు. కాలేజీ హాస్టల్ వార్డెన్‌గా ఉన్న క్యాడర్ ఉద్యోగికి ప్రీమెట్రిక్ హాస్టల్ బాధ్యతలు అప్పగించడానికి నిబంధనలు ఒప్పుకోవు. కానీ దేవుడిచ్చింది.. పూజారి కోరుకున్నదీ ఒకటే కాబట్టి ఉపేంద్ర డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. కవిటి మండలం పెద్ద కర్రివానిపాలెం బాయ్స్ హాస్టల్ వార్డెన్ ఎం.నారాయణ వెన్నుపూస సమస్యతో బాధపడుతున్నారని, ఆయన భార్యకు కూడా ఆరోగ్య సమస్యలు ఉన్నందున రణస్థలం మండలం పాతర్లపల్లి హాస్టల్‌కు అతన్ని బదిలీ చేయాలంటూ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ డీబీసీడబ్ల్యూవోకు లేఖ ఇచ్చారు. అలాగే ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కూడా నారాయణను తన నియోజకవర్గ పరిధి పాతర్లపల్లిలో వార్డెన్‌గా నియమిస్తే తనకెటువంటి అభ్యంతరం లేదని కూడా లేఖ ఇచ్చారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఒక ఉద్యోగి కోసం లేఖ ఇస్తే డీబీసీడబ్ల్యూవో వాటివైపు కన్నెత్తి చూడలేదు. లేని ఆరోగ్య సమస్యలు చూపించడం పరిపాటేనని సర్దిచెప్పుకుందామంటే.. ఎంఎస్ పల్లికి డిప్యూటేషన్‌పై పంపిన ఉపేంద్రకు మాత్రం ఇదే గ్రౌండ్‌ను ప్రామాణికంగా ఎలా తీసుకున్నారన్నదే ప్రశ్న. ఉపేంద్ర తల్లిదండ్రులు కాలం చేసి చాలా కాలమైంది. కానీ ఆయన తన వృద్ధ తల్లిదండ్రులను చూసుకోడానికి డిప్యూటేషన్ కావాలంటే మాత్రం డీబీసీడబ్ల్యూవో కళ్లు మూసుకొని సంతకం పెట్టారు. ఇది చాలదని త్వరలోనే ఆయనకు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టు కట్టబెట్టడానికి బేరం కుదుర్చుకున్నట్టు తెలిసింది. అడిగేవాడు లేడని అక్రమాలు చేసుకుంటూపోయారు. కానీ సిఫార్సు లేఖలిచ్చిన ఎమ్మెల్యేలు మాత్రం కలెక్టర్‌ను అడుగుతున్నారు. తమ లేఖలు కొరగాకుండా పోయాయా? అంటూ నిలదీస్తున్నారు. ఎన్ఈఆర్, బెందాళం అశోక్ లాంటి ఎమ్మెల్యేలు ఫోన్‌లో కలెక్టర్‌ను ప్రశ్నిస్తుంటే.. శ్రీకాకుళం ఎమ్మెల్యే ఏకంగా జేసీ, కలెక్టర్లతో తామెందుకున్నామంటూ గొడవపడ్డారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఇటీవల గొండు శంకర్ బదిలీలపై సమీక్షించారు కూడా. ఇక సర్వే డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి గతంలో పని చేసిన అధికారులు ఒకేచోట ఇద్దరు ముగ్గురికి బదిలీలు చేయడం, బదిలీ అయిన కొద్ది రోజులకే మళ్లీ కోరుకున్న చోటకు బదిలీ చేయడం వల్ల ఎవరు బదిలీకి అర్హులు? ఎవరి టెన్యూర్ ఐదేళ్లు పూర్తయింది? వంటి లెక్కలు తేల్చడానికే వీరికి కాల మంతా గడిచిపోతుంది. ఇప్పటికీ అర్హుల జాబితా ఇక్కడ తయారవలేదు.

## రవాణా శాఖ మంత్రిని కలిసిన ఎండీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు



**కాకినాడ:** కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి బుధవారం విచ్చేసిన రవాణా శాఖ మంత్రిని ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ తరపున మర్యాదపూర్వకంగా కలిశారు. ఎండీయూ ఆపరేటర్స్ ఎదుర్కొంటున్న వెహికల్ ఫిట్నెస్‌కి సంబంధించి 2023 నుంచి 2025 వరకు వెహికల్ (ఎఫ్‌సీ) రోజువారి పెనాల్టీ ఇప్పటికి రూ.10వేలుగా చూపుతున్నారని తెలిపారు. ఎండీయూ ఆపరేటర్స్ వెహికల్స్ ఎటువంటి పెనాల్టీ లేకుండా ఫిట్నెస్ చేసుకునే విధంగా ఈ నెల 8న పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆఫీస్ నుంచి జీవోను రిలీజ్ చేస్తూ ట్రాన్స్‌పోర్ట్ శాఖకు పంపించినట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆ జీవో ఆధారంగా రోజువారి పెనాల్టీ మినహాయించి, మొబైల్ క్యాంటీన్‌గా ఉన్న వెహికల్స్‌ని గూడ్స్ క్యారియర్ మార్చి క్లియరెన్స్ ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఈ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఆపరేటర్స్ మందాల సత్యప్రసాద్, అల్లంపల్లి దైవ పాల్, పెయ్యల దుర్గారావు, అల్లాడి చిట్టిబాబు పాల్గొన్నారు.



పాతపట్నంకు చెందిన స్వర్గీయ సూర్యనారాయణ పట్నాయక్ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య లలితకుమారి, కుమారుడు జిల్లా శిష్టకరణ సంఘ జాయింట్ సెక్రటరీ బాలకృష్ణ పట్నాయక్‌లు జిల్లా శిష్టకరణ సంఘ సామాజిక భవనానికి 20కుర్చీలను అందించారు. కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘ ప్రతినిధులు డబ్బీరు శ్రీనివాస్, సదాశివుని కృష్ణ, ఎస్‌వీడీ మురళి, మోహన్ మాస్టర్, సత్యనారాయణ పాత్రో, పరమానంద దళయ్, రామకృష్ణ, గోపీకృష్ణలు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, పాతపట్నం**

## అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలి




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**


పట్టణ నడిబొడ్డులో నిర్మిస్తున్న అక్రమ కట్టడంను తక్షణమే నిలుపుదల చేయాలని స్థానికంగా నివశిస్తున్న మణికొండ ఆదినారాయణ మూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక శ్రీకాకుళం రోడ్‌లో గల శివజ్యోతి హోటల్ ఎదురుగా దుర్గా జనార్ధనరావు అనే వ్యక్తి మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారన్నారు. స్థల వైశాల్యం సుమారు 150 చదరపు మీటర్లు ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ముందు భాగాన కనీసం ఒకటిన్నర మీటర్లు మిగిలిన మూడు వైపులా ఒక మీటర్ వదిలి నిర్మించాల్సి ఉందన్నారు. కానీ ఉత్తరం వైపు తప్ప మిగిలిన మూడు వైపులా ఖాళీ స్థలం వదలలేదని విమర్శించారు. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న రద్దీ దృష్ట్యా డబల్ రోడ్డు లేని చౌక్‌బజార్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ పెరిగిపోతుందన్నారు. ఫలితంగా ప్రజలకు అసౌకర్యమే కాక వాతావరణ కాలుష్యం పెరగడం వంటి దుష్ఫలితాలు అందరికీ ఇబ్బందులు కలుగుతాయన్నారు. అందుచేత రోడ్డు వెడల్పు పెంచడం వంటి దీర్ఘకాలిక ప్రణాళికతోపాటు నూతనంగా నిర్మించబడుతున్న భవనంలో నిబంధనల మేరకు స్థలం వదిలి నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులే చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ఇసుక రేవును పరిశీలించిన సువ్వారి

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

మండలంలోని నిమ్మతోర్లవాడ పంచాయతీ (పాతూరు) పాతనిమ్మతొర్లవాడ గ్రామంలో గల ఇసుక రేవు పరిశీలించిన ఆమదాలవలస నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ బుధవారం పరిశీలించారు. అదే విధంగా దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అని చెప్పి, ఈ దాడులు జరగడం వెనక ఉన్న మతలబు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈయనతోపాటు మాజీ ఎంపీటీసీ కోరుకొండ సాయికుమార్, పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, ఎన్ తవిటిరెడ్డి, యతిరాజులు గోపి, మోహన్, గురుగుబెల్లి రాజశేఖర్, సూరి, సనపల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.





ఈరోజు గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును విజయనగరం తన గృహంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛమిచ్చారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, కార్యనిర్వహణాధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వాతావరణంలో మార్పులు, వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందు వలన ముందస్తు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. బుధవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలను తప్పకుండా తీసుకోవాలన్నారు. నీటి ద్వారా, కలుషిత ఆహారం ద్వారా అధికంగా వ్యాధులు ప్రబలతాయన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిర్మూలనకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులను కార్యాచరణ ప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టంగా ఆదేశించారన్నారు. తాగునీటి ట్యాంకులు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో తాగునీటి పరీక్షలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. జనవరి మాసం నుండి మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి కేసులలో కొద్దిపాటి లక్షణాలతో డెంగ్యూ కేసులు నమోదైనప్పటికీ తొందరగా రోగులకు కోలుకున్నట్లు తెలిపారు. పక్క రాష్ట్రమైన ఒడిస్సా నుండి వచ్చిన రోగుల వలన కంచిలి ప్రాంతాల్లో మలేరియా కేసులు వ్యాప్తిచేంది 24 కేసులు నమోదు అయినట్లు వివరించారు. ప్రతి శుక్రవారం నాడు ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ, పంచాయితీ ఆధ్వర్యంలో నీటి నిల్వలు, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలో చేరిన నీరు వంటి ప్రాంతాల్లో లార్వా వృద్ధి చెందకుండా దోమల నివారణకు పారిశుద్ధ్య, పిచికారి పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పైలట్ ప్రోగ్రామ్‌గా గిరిజన ప్రాంతాల్లో దట్టమైన పొదలు, వెళ్లేందుకు అవకాశం లేని ప్రాంతాల్లో దోమల నివారణకు డ్రోన్ సహాయంతో పిచికారీ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా అతిసార వ్యాధి, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని ప్రజలు ఈ వ్యాధుల పట్ల అవగాహన కలిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలని, నిల్వ ఉంచిన వంట పాత్ర ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామ దాసు, స్టాటిస్టికల్ అధికారి రామ నాగేశ్వరరావు, పరిపాలనాధికారి బాబూరావు, డిప్యూటీ డెమో అధికారి ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




## సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ఆర్థిక సాయం

**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**




మండలంలోని కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన దుమ్ము రమేష్ చిన్న వయసులోనే దీర్ఘకాలిక కాలేయ వ్యాధి బారినపడి కొంతకాలంగా బాధపడుతున్నారు. ప్రస్తుతం వ్యాధి మితిమీరడంతో విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో టెస్టులు చేయగా అత్యవసరంగా కాలేయ మార్పిడి చేయాలని, సుమారు రూ.35లక్షలు వరకు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత స్థోమత లేక దాతల సహాయం కొరవడడంతో బుధవారం సిక్కోలు స్వచ్ఛంధ సేవాసమితి సంస్థ తరుపున ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులు బాధితునికి అందించామన్నారు. కార్యక్రమంలో శింతు ఆటకేశం, పొడుగు చరణ్, కలివరపు సూర్యప్రకాష్‌లున్నారు.

## నగరంలో క్యాన్సర్ వైద్య నిపుణుల సేవలు

### - ప్రతి బుధవారం రోగులకు అందుబాటులో

**(సత్యంన్యూస్,శ్రీకాకుళం)**



క్యాన్సర్ వైద్య నిపుణుల సేవలు నగరంలోని డే అండ్ నైట్ కూడలిలో ఉన్న సూర్య మణికంఠ డాక్టర్స్ ప్లాజాలో ప్రతి బుధవారం అందుబాటులో ఉండనున్నట్టు ఆపోలో క్యాన్సర్ సెంటర్ నిపుణులు కొండముది ధీరజ్ తెలిపారు. బుధవారం స్థానిక సూర్య ప్లాజాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధీరజ్ మాట్లాడారు. ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఓపీ నిర్వహించనున్నట్టు తెలిపారు. హెడనా క్యాన్సర్‌తో బాధపడుతున్నవారెవరైనా కన్సల్ట్ చేయాలని సూచించారు. హెడనా క్యాన్సర్ పరిధిలోకి వచ్చే నోరు, గొంతు, చెవి, ముక్కు, మెడ, థైరాయిడ్ క్యాన్సర్, చర్మం తదితర క్యాన్సర్‌లను నిర్ధారించి చికిత్స అందించనున్నట్టు తెలిపారు. క్యాన్సర్‌కు చికిత్సను విశాఖలోని అపోలో క్యాన్సర్ సెంటర్ ద్వారా అందిస్తున్నట్టు తెలిపారు. మెడికల్, సర్జికల్ అంకాలజీ విభాగాల్లో విజయవంతంగా క్యాన్సర్‌కు చికిత్స చేస్తున్నట్టు తెలిపారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించ వచ్చు న్నారు. దీన్ని గుర్తించి చికిత్స అందించగలిగితే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని శ్రీకాకుళం జిల్లా ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అపోలో ప్రతినిధి కె సాగర్ తదితరులు ఉన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.